వర్షం కురిసిన రాత్రి.!

బిక్కుబిక్కుమంటూ రాత్రంతా గడిపిన ముంపు బాధితులు

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాయం కోసం ఎదురుచూపులు
- నీట మునిగిన శ్రీరాంనగర్ కమాన్ బస్తీ
- బస్తీని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను నిలదీసిన బస్తీవాసులు

చినుకు పడితే కునుకు ఉండదు



శ్రీరాంనగర్ బస్తీలో మోకాళ్లలోతు నీళ్లు వచ్చిన దృశ్యం




శ్రీరాంనగర్ బస్తీలో ఇళ్లలోకి నీరు చేరి సరుకులు తడిసిపోయిన దృశ్యం



నీట మునిగిన శ్రీరాంనగర్ బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్



శ్రీరాంనగర్ కమాన్ బస్తీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ కె.రవిచారి



శ్రీరాంనగర్ బస్తీని అనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగర నడిబొడ్డులో ఇటు నారాయణగూడ.. అటు ఆర్టీసీక్రాస్ రోడ్. వెనకవైపు ఫీవర్ ఆస్పత్రికి మధ్యలో ఉన్న శ్రీరాంనగర్ బస్తీవాసులకు చినుకు పడితే కునుకు ఉండటం లేదు. భారీ వర్షం వస్తే శ్రీరాంనగర్ కమాన్ బస్తీలోని ఇళ్లన్నీ నీట మునగాల్సిందే. ఈ బస్తీవాసులు అనేక సంవత్సరాలుగా నీటి గండంతో సావాసం చేస్తున్నామని బస్తీవాసులు పేర్కొంటున్నారు. అధికారులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా.. ప్రజాప్రతినిధులకు ఎంత విన్నవించుకున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని చెబుతున్నారు.

బస్తీ మునిగినప్పుడే వస్తారా..?

◆ బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కమాన్ బస్తీలోని ఇళ్లు మునిగాయి. దీంతో తెల్లారి లేచి చూసేవారికి ఇళ్లలోకి నీళ్లు రావడంతో పలు ప్రజలంతా అవక్కాయ్యారు. ఇటు బయటకి రాక.. అటు ఇంట్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారిలు పరిస్థితిని పరిశీలించారు. దీంతో అక్కడికి చేరుకున్న స్థానికులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను నిలదీశారు. భారీ వర్షం వచ్చి నీట మునిగితే వచ్చి పరిశీలిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 7గంటల నుంచే 2 మోటర్లతో నీళ్లు తొలగిస్తున్నప్పటికీ నీళ్లన్ని రివర్స్‌గా వస్తున్నాయని ప్రజాప్రతినిధులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు.

నాలా బ్లాక్‌ను గుర్తించి.. జేసీబీతో తొలగించి.!

◆ బస్తీ ముందున్న ఖాళీ స్థలంలో నుంచి పోతున్న నాలాను బ్లాక్ చేయడం వల్ల వరద నీరు నిలిచిపోయినట్టు ఆయన గుర్తించారు. వెంటనే ఆయన మూసేసిన నాలాను జేసీబీ సహాయంతో క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ఖాళీ స్థలానికి ప్రభుత్వ స్థలంగా సైన్ బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు గంటల్లో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. మళ్లీ బస్తీనీట మునగకుండా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు బస్తీ నాయకులు రూపుల వివేక్, కోటా రమేష్ తెలిపారు.

మనిషి ప్రాణాలకు రక్షణ ఉండదు



శ్రీరాంనగర్ బస్తీలోని ఒక కాలనీ నీట మునిగిన దృశ్యం



మోటార్లతో నీటిని తొలగించడానికి ప్రయత్నిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ముషీరాబాద్ సామాన్ బర్బాద్

ఇళ్లలోకి వరదనీరు చేరడంతో తడిసి ముద్దయిన నిత్యావసరాలు



ప్రాగాటూల్ చౌరస్తా నుంచి భోలక్‌పూర్ వెళ్లే దారిలో భారీగా ప్రవహిస్తున్న వరద



వినోభానగర్‌లో ప్రహరీ కూలడంతో బారీకేడ్ ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ

ముషీరాబాద్: ముషీరాబాద్, భోలక్‌పూర్‌లో కురిసిన భారీ వర్షానికి మోకాలి లోతు నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రాగాటూల్స్ చౌరస్తా నుంచి భోలక్‌పూర్ పద్మశాలి కాలనీ మీదుగా పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో వాహనాలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి నీళ్లు రావడంతో నిత్యావసరాలు తడిసి ముద్దయ్యాయి. దామోదర సంజీవయ్య (డీఎస్)నగర్ నాలా పరీవాహక ప్రాంతంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పర్యటించారు. ఇళ్లలోకి నీళ్లు వచ్చి ఇబ్బంది పడ్డ ప్రజలను పరామర్శించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించి తక్షణం వరద నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకుని సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వై. శ్రీనివాస్, కేఎం సాయి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలికాలనీలో తడిసిన బియ్యాన్ని చూపుతూ..



నాలా పరివాహక ప్రాంతం డీఎస్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు




వరద బాధితులకు అల్పాహారం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో బుధవారం రాత్రి కుర్షిన భారీ వర్షానికి బస్తీ ఆతలాకుతలమైంది. ఈ సందర్భంగా రాత్రి బస్తీని సందర్శించడంతో పాటు గురువారం ఉదయం వరద బాధితులకు అన్నం పొట్లాలను సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అందజేశారు. ఏ సమయంలోనైనా తమకు ఫోన్ చేస్తే అందుబాటులో ఉంటామని తెలిపారు. భయపడ వద్దని వరద బాధితులకు అండగా ఉంటామన్నారు. అదే విధంగా జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పావని వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మెతుకు ఉమేష్, శ్రీనివాస్‌గౌడ్, సోను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

చిక్కడపల్లి: ముంపుబారిన పడిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పర్యవేక్షణలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గాంధీనగర్ డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. వరద బాధితులకు సాయం అందజేశారు.

గగన్‌మహల్‌లో వరదనీటిలోనే అపార్ట్‌మెంట్



గగన్‌మహల్.. నీటితో ఫుల్.!

కవాడిగూడ: డివిజన్‌లోని గగన్‌మహల్‌లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి అపార్ట్‌మెంట్‌లు ఉదయం వరకు జలదిగ్బంధంలోనే ఉండిపోయాయి. కాలనీ వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు నాలా రిటర్నింగ్ వాల్‌కు రెండు రంధ్రాల చేశారు. కానీ హుస్సేన్‌సాగర్ నాలా ఉధృతంగా ప్రవహించడంతో వర్షపునీరు రివర్స్ అవ్వడంతో గురువారం ఉదయం 11గంటల వరకు శివ ప్యాలెస్, జానకీ, జయ, చిత్రగుప్తా, గగన్‌మహల్ అపార్ట్‌మెంట్‌లు వాసులు నరకయాతన అనుభవించారు.

◆ రోడ్డుపై మోకాలి లోతు వరకు వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. సమాచారం అందుకున్న డీఎంసీ రామానుజుల రెడ్డి, డీఈ సన్ని, ఏఈ వినోద్, హైడ్రా సిబ్బంది, కార్పొరేటర్ జి. రచనశ్రీ, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలా పూడికతీత సరిగా తీయకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు వరదనీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

◆ కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ.. హుస్సేన్‌సాగర్ నాలాలో రిటర్నింగ్ వాల్ సమీపంలో పూడికను లోతుగా తీస్తే సమస్య ఉండదన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్ నేత జైసింహ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇదే వీధిలో పెండింగ్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు.



కాలనీలో సహాయక చర్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ



స్థానికులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ

ఫీజు కట్టలేదని ఇంటర్నల్ పరీక్షకు నిరాకరణ

కాలేజీ ఎదుట విద్యార్థుల ఆందోళన

చిక్కడపల్లి: విద్యార్థులు ఫీజు కట్టలేదనే కారణంతో ఇంటర్నల్ ఎగ్జామ్స్ హాజరు కావడానికి కళాశాల యాజమాన్యం ఒప్పుకోకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. చిక్కడపల్లి మెట్రోస్టేషన్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ఘటన జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వచ్చి ఎగ్జామ్స్ రాయడానికి అంగీకరించాలని కోరారు. యాజమాన్యం అగీకరించకపోవడంతో వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో తనపై ఓ విద్యార్థి తల్లి దాడి చేశారని మహిళా ప్రిన్సిపాల్ చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పేరెంట్స్ కూడా కాలేజీ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ శంకర్ మాలోత్ తెలిపారు.

వెదురు ఉచితంగా ఇవ్వాలి

కాచిగూడ: మేదరి వృత్తిదారులకు వెదురును ఉచితంగా సరఫరా చేసే విధంగా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేయాలని మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేపీ మురళీకృష్ణ కోరారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా మేదరి మహేంద్ర సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శీలం వెంకటేష్ అధ్యక్షతన గురువారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షలకు పైగా ఉన్న వెదురు కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. 50 ఏళ్లు దాటిన మేదరి వృత్తిదారులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని కోరారు. వృత్తి నైపుణ్యం శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి సబ్సిడీ లోన్‌లు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

బోయి భీమన్నకు నివాళి



చిక్కడపల్లి: దళితులపై జరుగుతున్న ఆకృత్యాలను ఎండగడుతూ బోయి భీమన్న రాసిన 'పాలేరు నాటకం'ఆనాడు ఎందరినో చైతన్య పరిచిందని డాక్టర్ పి.సత్యనారాయణప్రసాద్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం బోయి భీమన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోయి భీమన్న రాసిన 'గుడిసెలు కాలిపోతున్నాయి'సుదీర్ఘ కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని తెలిపారు. భీమన్న ప్రతిభను గుర్తించి ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, కేంద్రం పద్మభూషణ్ అవార్డులతో సత్కరించిందని పేర్కొన్నారు.

దోమలగూడ ఇన్‌స్పెక్టర్‌గా మహమ్మద్ అంజద్‌అలీ



కవాడిగూడ: దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గురువారం మహమ్మద్ అంజద్‌అలీ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీఎస్ పరిధిలోని అన్నివర్గాల ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేరాల అదుపుకు ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా రౌడీ షీటర్లు, పాతనేరస్తులు మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పీఎస్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరిగితే వారిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో చోరీ

ముషీరాబాద్: రాంనగర్‌లోని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సెప్టెంబర్ 12వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు బి. నర్సింగ్‌రావు కుమారుడు బి. శ్రీకాంత్ ఆలయ హుండీ నుంచి డబ్బు దొంగతనం చేసినట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి ఆలయ కమిటీ చైర్మన్ ఎస్. రాజేశ్వరిగౌడ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎంఎఫ్‌సీకు పాలకమండలిని నియమించాలి



చిక్కడపల్లి: మహేంద్ర మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎంఎంఎఫ్‌సీ)కు రూ.వేయి కోట్లు కేటాయించి వెంటనే చైర్మన్, పాలక మండలిని నియమించాలని జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలోని జంటనగరాల మహేంద్ర సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహేంద్ర మేదర కులస్తులను ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలుగు రాష్ట్రాలకు చెందిన తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఉప్పల్ భగాయత్‌లో మేదర ఆత్మగౌరవ భవనానికి కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. వెదురు పెంపకానికి నగర శివారు ప్రాంతంలో వెయ్యి ఎకరాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పిల్లి గురుమూర్తి, పిల్లి రాంకుమార్, కె.నర్సింగ్‌రావు, పిల్లి రాజగోపాల్, వి.కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంట పనుల్లో నాణ్యత పాటించాలి

అంబర్‌పేట: బతుకమ్మకుంట పునరుద్ధరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. గురువారం హైడ్రా ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మోహన్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గ్రూప్-1 ఉద్యోగాలపై డివిజన్ బెంచ్‌కు వెళ్లొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్: విద్యానగర్‌లోని బీసీభవన్‌లో 'గ్రూప్-1 ఉద్యోగాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు - అప్పీలకు వెళ్లాలనే ప్రభుత్వ ఆలోచన'అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షలో అవకతవకలు జరిగాయని అందువల్లే ఒక సెంటర్‌లో పరీక్ష రాసిన అనేక మందికి ఒకే మార్కులు వచ్చాయని హైకోర్టులో ఆధారాలు పెట్టారని తెలిపారు. దీంతో తెలుగులో పరీక్ష రాసిన విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో 12 ఏళ్లుగా గ్రూప్-1 పోస్టులు భర్తీ కావడం లేదన్నారు. 560 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టు తీర్పుపై పట్టింపులకు పోకుండా విద్యార్థుల భవిష్యత్‌ను ఆలోచించి డివిజన్ బెంచ్‌కు వెళ్లాలనే ఆలోచనను విరమించి తిరిగి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైకోర్టుకు వెళ్లినా... పై కోర్టుకు వెళ్లినా ఇదే తీర్పు వస్తుందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు సి. రాజేందర్, రాజునేత, మణికంఠ, జి. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌కు దత్తన్న ఆహ్వానం

అంబర్‌పేట: దసరా పండుగ సందర్భంగా నిర్వహించే 'అలయ్ బలయ్' కార్యక్రమానికి హాజరు కావాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుకు ఆహ్వానపత్రిక అందజేశారు. రాజకీయాలకు అతీతంగా 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దత్తాత్రేయ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు లక్ష్మణ్‌యాదవ్, నారాయణస్వామి, శ్రీకాంత్‌గౌడ్, రామ్మోహన్, శ్రీధర్, సుధాకర్, జాహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి అందరూ ఆహ్వానితులే..

25న సీఎం చేతుల మీదుగా బతుకమ్మకుంట ప్రారంభం : వి.హనుమంతరావు



అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మకుంటను ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా వి.హనుమంతరావు గురువారం కాంగ్రెస్ పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట, గోల్నాక, నల్లకుంట, కాచిగూడ డివిజన్ల నుంచి ప్రజలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రోహిణ్‌రెడ్డి, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నారాయణస్వామి, శంబుల శ్రీకాంత్‌గౌడ్, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, పులి జగన్, గడ్డం శ్రీధర్‌గౌడ్, రామ్మోహన్, రాజేశ్వర్‌రావు, హరితిలక్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ: ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించిన 186 చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ తులం బంగారం స్కీమ్ అమలు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చందన, ఆర్ఐ నిరంజన్, ఆర్ఐ శివప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు శ్యామ్‌యాదవ్, ఆర్.రాంచందర్, రాజేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, శివముదిరాజ్, ప్రవీణ్, దీన్ దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించలేదని కార్పొరేటర్ల నిరసన

రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించకుండా అవమానించారని కార్పొరేటర్ రచనశ్రీ ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, డిప్యూటీ తహసీల్దార్ చందనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ ఫొటోలు లేకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లబ్ధిదారులకు ఉదయం 10గంటలకు సమయం ఇచ్చి 11.30గంటల వరకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ వచ్చేంత వరకు కార్యక్రమాన్ని ప్రారంభించలేదని వారు ఆరోపించారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు.

